క్లుప్తంగా

గ్రామాల్లో నీటి సమస్య రానివ్వం

- రూ.26.74 లక్షలతో ప్రతిపాదనలు
- 15 నుంచి గ్రామాలకు నీటిసరఫరా

బొల్లాపల్లి: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, తగు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ పి. సురేష్ తెలిపారు. మండలంలోని ఆరు గ్రామాలకు నీటి సమస్య ఉన్నట్లు గుర్తించామని, ఆయా గ్రామాలకు ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. గండిగనుముల, షోలాయపాలెం, రేమిడిచర్ల, మన్నేపల్లి తండా, గంగుపల్లి తండా, చక్రాయపాలెంలలో నీటి సమస్య తీరడానికి రూ.26.74 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ నెల 15 నుంచి ఆయా గ్రామాల్లో నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

రైతు కూలీకి ఎమ్మెల్యే పరామర్శ

వినుకొండ(నూజెండ్ల): విద్యుదాఘాతంతో గాయపడి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నూజెండ్ల గ్రామానికి చెందిన మహిళా రైతు కూలీ కాటం శేషారత్నంను స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్యోగ పరిస్థితి గురించి డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

11న మెగా జాతీయ లోక్ అదాలత్

వినుకొండ (నూజెండ్ల): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీన స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మెగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎ.తౌషిద్ హుస్సేన్ తెలిపారు. ఈ మెగా జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన సివిల్ వివాదాలు, క్రిమినల్, చెక్‌బౌన్స్, మనోవర్తి వివాదాలు, బ్యాంక్, ప్రీ లిటిగేషన్ కేసులు కక్షిదారులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు కోర్టు ఆవరణలోని మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రొంపిచర్లలో నేడు ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసిఉన్న గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి కల్యాణోత్సవం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరికీ ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫోక్సో కేసు నమోదు

బొల్లాపల్లి: మండలంలోని గరికపాడు గ్రామంలో ఓ వ్యక్తిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని బండ్లమోటు ఎస్‌ఐ జె.బలరాం రెడ్డి శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన మైనర్ బాలికను జొన్నగిరి అంజయ్య బలవంతంగా తీసుకెళ్లాడని తెలిపారు. నిందితుడు వెల్దుర్తి మండలం శిరిగిరిపాడుకు చెందిన వాడని, గత ఏడు నెలలుగా గరికపాడు గ్రామంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. మైనర్ బాలిక ఫిర్యాదు మేరకు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ప్రతి పేదవాడి సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ముప్పాళ్లలో గడప గడపకు మన ప్రభుత్వం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులను పలకరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

ఈపూరు: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో నాల్గవ రోజు శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రత్యేకంగా వృద్ధులను, వితంతువులను పింఛన్ అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే ఒక్కొక్క కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇంటి స్థలంతో పాటు రైతు భరోసా, అమ్మఒడి, కాపునేస్తం వంటి పథకాలు అందుతున్నాయని, వాటి ద్వారా ఒక్కో కుటుంబం రూ.3 లక్షల వరకు లబ్ధి పొందుతుందని తెలుపుతూ వారికి కరపత్రాలను అందజేశారు. వినుకొండ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతిపక్షనాయకులు అభివృద్ధి పనులను అడ్డుకుంటుంటూ పైశాచిక ఆనందం పొందుతున్నారని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ముఖ్యమంత్రి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తీరుతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, సర్పంచ్ బయ్యారపు రమ్యరవి, ఈపూరు సొసైటీ అధ్యక్షుడు బొల్లా బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకటహనుమయ్య, కోటిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వే వేగవంతం చేయాలి

- ఆయుష్మాన్ భారత్‌తో ప్రతి ఒక్కరికీ ఐడీలు
- కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన సమావేశం



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు పక్కన ఎంపీడీవో వై.హనుమా రెడ్డి

యడ్లపాడు: మండల పరిధిలో నిర్వహిస్తున్న ఆరోగ్య సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం శనివారం ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్, కమ్యూనిటీ డీసీజ్ కంట్రోల్ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద మండలంలోని పరిధిలోని అన్ని కుటుంబాలకు చెందిన వారికి విధిగా ఐడీలను రూపొందించాల్సి ఉందన్నారు. ఈ నమోదు కార్యక్రమంలో ఆధార్ అనుసంధానం కాని వారిని సైతం ఆరోగ్య కార్యకర్తలు గుర్తించి ఐడీల రూపకల్పన చేయాలని కోరారు. అలాగే ఇప్పటికే కొనసాగుతున్న హానికారిక వ్యాధులను నిరోధించడానికి చేపట్టిన ఇంటింటి ఆరోగ్య సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో పున్నారావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వేగవంతంగా ఇళ్ల నిర్మాణం



జగనన్న కాలనీలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: వైఎస్సార్-జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పసుమర్రులోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను మున్సిపల్, హౌసింగ్ అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రఫాని మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులను స్వయంగా నిర్వహించలేని వారి కోసం ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ నిర్మించి ఇచ్చేలా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని సదుపాయం కల్పించారని తెలిపారు. జీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఈ నిర్మాణ పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫేజ్-1 కింద 3,022 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రాగా ఆప్షన్-3 కింద ఇళ్ల నిర్మాణాలు చేయించేందుకు 1358 మంది అంగీకారం తెలిపారని చెప్పారు. ఇందులో వెయ్యి ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు వివరించారు. లబ్ధిదారులు కేవలం రూ.35 వేలు చెల్లిస్తే, నిర్మాణ కంపెనీ గృహ నిర్మాణం పూర్తి చేసి ఇస్తుందన్నారు. అంగీకారం తెలిపిన 1358 మందిలో 358 మంది మెప్మా సిబ్బంది సహకారంతో బ్యాంకు ఖాతాలు తీస్తేవారి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. లబ్ధిదారులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని తమ సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయించేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఆప్షన్-3తో పాటు వ్యక్తిగతంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేసే వారికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ ఎస్.వెంకట్రావు, 14వ ఆర్థిక సంఘం సభ్యుడు వడితే కోట్యా నాయక్, పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, మున్సిపల్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: పోస్టల్ శాఖలో అమలు చేస్తున్న బీమా పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు కేతిబోయిన సరస్వతి అన్నారు. శనివారం స్థానిక పోస్టల్ బ్రాంచ్ కార్యాలయంలో రూ.399 రూపాయలకు గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ బీమా పాలసీలు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ ఈపాలసీలో 18 నుంచి 65 సంవత్సరాలోపు వయసు కల్గిన వారు అర్హత పొందుతారన్నారు. ఈ పథకంలో నమోదైన లబ్ధిదారులు పాముకాటు, విద్యుత్‌షాక్, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షల బీమా సౌకర్యం పోస్టల్ ద్వారా లబ్ధి చేకూరతుందన్నారు. కార్యక్రమంలో శావల్యాపురం పోస్టల్ అధికారి దావులూరి శివ కోటేశ్వరరావు, కొత్తలూరు పోస్టల్ అధికారి కోటేశ్వరరావు, నాసర్‌వలీ ఉన్నారు.

జాతీయ తైక్వాండోలో రజత పతకం

నరసరావుపేట ఈస్ట్: బెంగుళూరులో నిర్వహించిన జాతీయ జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని ఎం.ఎం.అంజలీసాయిలక్ష్మి రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సోముమల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డా.వై.మధుసూదనరావు లు శనివారం తెలిపారు. తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున 44 కేజీల విభాగంలో పాల్గొని రజితపతకం సాధించిన సాయిలక్ష్మీని కళాశాల పాలకవర్గ సభ్యులు అభినందించారు.

నేడు కొండగురునాథ స్వామి తిరునాళ్ల

తిరునాళ్లకు 12 భారీ విద్యుత్ ప్రభల ఏర్పాటు



కొండగురునాథుని మూలవిరాట్

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని రవ్వారం సమీపంలో వెలసిన కొండ గురునాథుని స్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన ఈ తిరునాళ్లకు పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు లక్షల సంఖ్యలో తరలి వస్తారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున తిరునాళ్ల జరుపుకోవటం ఆనవాయితీగా వస్తుంది. కొండ గురునాథుని సేవిస్తే కోరిన కోర్కెలను తీరుస్తాడని భక్తుల విశ్వాసం.

అలాగే కొండపైన వెలసిన సంతాన లింగేశ్వరుని ఆరాధిస్తే సంతానం కల్గుతుందని భక్తుల నమ్మకం. తిరునాళ్లకు 12 భారీ విద్యుత్ ప్రభలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థ సత్రాల వారు అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తాగు నీటి సౌకర్యంతోపాటు నూజెండ్ల పీహెసీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నారు. వినుకొండ, ఆర్టీసీ డిపోతోపాటు, ప్రకాశం జిల్లా అద్దంకి, దరిశి, పొదిలి, డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఐనవోలు పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

మెట్లపూజతో వేడుకలు ఆరంభం

కొండగురునాథుని స్వామి తిరునాళ్ల సందర్భంగా శనివారం మెట్లపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు మెట్లపూజలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలుచేశారు.

తిరునాళ్ల ఏర్పాట్లు వేగవంతం చేయాలి

- కోటప్పకొండలో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- 10వ తేదీకి ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశం



తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 18వ తేదీన నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లను ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కోటప్పకొండలో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తిరునాళ్లకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లును పరిశీలించారు. యల్లమంద సమీపంలోని వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణపనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. తిరునాళ్ల రోజు ప్రభలు, యాత్రికుల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బ్రిడ్జి వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొండ దిగువన నూతనంగా ఏర్పాటుచేసిన సెంట్రల్‌లైటింగ్‌ను పరిశీలించారు.

ఘాట్‌రోడ్డులోని విగ్రహాలకు రంగులు వేసే పనుల ప్రగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొండ మీద నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన సత్రం, విశ్రాంతి గదులు, గెస్ట్‌హౌస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునే క్యూలైన్‌ల ఏర్పాటును పరిశీలించారు. విఐపీల వలన సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పమిడిమర్రు నుంచి కోటప్పకొండ వరకు రోడ్డు విస్తరణ పనులను పూర్తిచేసి తిరునాళ్లకు భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

కొండకు వచ్చే అన్ని రోడ్లలో చేపట్టిన మరమ్మతు పనులు ఈనెల 14కు పూర్తిచేయాలని తెలిపారు. ఏకాదశి రోజున కొండ మీద నూతనంగా నిర్మించిన అన్నదాన సత్రం, యాత్రికుల విశ్రాంతిభవనాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఈవో వేమూరి గోపి, డీఎస్పీ విజయభాస్కరరావు, రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐ బాల నాగిరెడ్డి, పీఆర్ డీఈ హరనాథ్, సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, మట్లా లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలు అభినందనీయం

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతంలో స్వచ్ఛంద సంస్థల దాతల సహకారం అభినందనీయమని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. శనివారం బీ.ద.చేంజ్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో మండలంలోని కారుమంచి గ్రామం ఎస్సీ కాలనీలో ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సంబంధించి కంచాలు, గ్లాసులు వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బీ ద చేంజ్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని, పేద విద్యార్థులకు అన్నీ విధాలుగా చేయూతనివ్వటం అభినందనీయమన్నారు.

అనంతరం 10 వేలు విలువచేయు కంచాలు, గ్లాసులు విద్యార్థులకు అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, సంస్థ ప్రతినిధులు పాపసాని సురేష్, మల్లిఖార్జున రెడ్డి, చుండూరి హేమంత్ కుమార్, సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

నరసరావుపేట రూరల్: ఎఎం రెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థులు శనివారం పట్టణంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. మందులను కొనగలం కాని ఆరోగ్యాన్ని కొనలేం అంటూ నినాదాలు చేశారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, కారకాలు, రకాలపై విద్యార్థులు కరపత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెంలో ఈ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు గున్నం చంద్రశేఖర్ మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడుతున్నవారిలో 70 శాతం మహిళలు ఉంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ భూషణ్‌రావు, ఫార్మా-డి విభాగాధిపతి డాక్టర్ కిరణ్, డీన్ డాక్టర్ లక్ష్మీ, సురేఖ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహోన్నత దర్శకుడు విశ్వనాథ్

చిలకలూరిపేటటౌన్: అంతరించి పోతున్న కళలకు ప్రాణం పోసిన గొప్ప సినీ దర్శకుడు, కళాతపస్వి విశ్వనాథ్ అని ప్రముఖ రంగ స్థల కళాకారుడు, రచయిత విడదల సాంబశివరావు చెప్పారు. శనివారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఇటీవల మరణించిన దర్శకుడు కె.విశ్వనాథ్ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య వ్యక్తిని కథానాయకుడిగా నిలబెట్టిన మహోన్నత వ్యక్తి విశ్వనాథ్ అని కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, ఉప్పాల భాస్కరరావు, ఎం.రాధాకృష్ణ, గ్రంథాలయ ఇన్‌చార్జి నాగుల్‌మీరావలి, వీర్రాజు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మోహిద్దీన్



ముఖ్దుం మోహిద్దీన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

చిలకలూరిపేట: ఉపాధ్యాయ సంఘ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ముఖ్దుం మోహిద్దీన్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ప్రముఖ ఉర్దూ కవి, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నిర్మాత ముఖ్దుం మోహిద్దీన్ జయంతిని శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆయన ఎన్నో ఉద్యమాలు చేపట్టారని చెప్పారు. అధ్యాపకుడిగా జీవితం ప్రారంభించిన ఆయన ఎన్నో కార్మిక సంఘాలను స్థాపించటంతో పాటు సమసమాజ స్థాపన కోసం జీవితకాలం కృషి చేసిన ధన్యజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ డైరీ కమిటీ కన్వీనర్ కె.కోటేశ్వరరావు, నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, షేక్ జమీర్‌బాషా పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో వృద్ధుడి ఆత్మహత్య

బొల్లాపల్లి: పురుగు మందు సేవించి ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో జరిగింది. బండ్లమోటు ఎస్ఐ జె.బలరాంరెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు (85) ఒంటరివాడు కావడంతో పోషణ, సపర్యలు లేక మనస్తాపానికి గురై పురుగుమందు సేవించి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు తిప్పిశెట్టి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్టర్‌కు గాయాలు

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కాంట్రాక్టర్ గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న శనివారపు సాంబశివరావు స్కూటీపై వెళుతున్న క్రమంలో ఎన్‌ఆర్‌టీసెంటర్‌లోని శ్రీనివాస ఫంక్షన్‌హాలు వద్దకు చేరుకోగానే అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో సాంబశివరావుకు తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితుడిని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

మండల సచివాలయాల కన్వీనర్‌గా సుభాని

నాదెండ్ల: మండలంలోని అప్పాపురం గ్రామానికి చెందిన పఠాన్ సుభాని గ్రామ సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథుల మండల కన్వీనర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 11 నుంచి గృహ సారథులు, కన్వీనర్లకు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లు, ఒక వలంటీర్ పరధిలో ఇద్దరు గృహ సారథులను నియమించినట్లు తెలిపారు. ప్రతి గృహాన్ని సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హెచ్‌ఎం టి.సత్యనారాయణ, పీఎంసీ కమిటీ చైర్మన్ సూరా శంకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలతో జిల్లాలోనే పాఠశాలకు నెంబర్ 1గా నిలపాలని కోరారు. ఇప్పటికే జిల్లా పరిషత్ అధికారులు స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించామన్నారు. అదనపు తరగతులు నిర్వహించి వారికి పౌష్టికాహారాన్ని కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట: మండల గ్రామ రెవెన్యూ ఆఫీసర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం సాయంత్రం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్ సైదాసాహెబ్, కార్యదర్శి సీహెచ్. గోపాలరావు, కోశాధికారి డీవీ శివనాగిరెడ్డి తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధిస్తే నగదు ప్రోత్సాహకాలు

విద్యాదాత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఇస్తానని గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులతో హెచ్‌ఎం సుందరరావు, ఢిల్లీకి చెందిన ఆర్కిటెక్ట్ ఉప్పల గోస్ట్‌తో కలిసి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించి పల్నాడు జిల్లాలోనే పాఠశాలలో ముందంజలో నిలపాలన్నారు. ఇష్టంతో కష్టపడి చదివితే మార్కులు అవే వస్తాయని చెప్పారు. ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా ఉంటూ, ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం ఆర్కిటెక్ట్ ఉప్పల గోస్ట్ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో యన్నం శివారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా పలు సేవలు

ఈపూరు : రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం పలు రకాల సేవలు అందిస్తుందని, వాటిని రైతులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తెలిపారు. మండలంలోని కొండ్రముట్ల, అగ్నిగుండాల, అంగలూరు, కొండాయపాలెం, వనికుంట, ఈపూరు రైతు భరోసా కేంద్రాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు రైతు భరోసా కేంద్రంలో నిర్వహించాల్సిన విధులు, రిజిస్టర్ల గురించి తగు సూచనలు తెలియజేశారు. అలాగే వరి, మొక్కజొన్న, శనగ పంట పొలాలను సందర్శించి ఆయా పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు రైతులకు తెలియజేశారు.